క్లుప్తంగా

'అభ్యంతరాలు తెలియజేయండి'



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

టెక్కలి రూరల్: గత కొద్ది రోజులుగా బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటా ఓటరు సర్వేలో భాగంగా ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అలాగే పార్టీల నాయకులు అడిగిన పలు సందేహాలకు వివరణ ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకం



తిరుపతిరావుతో కలిసి నామినేషన్ పత్రాలు తీసుకుంటున్న క్షేత్ర సహాయకుడు నాగేశ్వరరావు

నందిగాం: మండలంలో అన్నాపురం పంచాయతీ సర్పంచ్ బార్నాన దామోదరరావు అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆ స్థానంలో ఎన్నిక కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. ఎన్నికలో టీడీపీ మద్దతుదారుడిగా బార్నాన తిరుపతిరావు పోటీ చేయనున్నాడు. ఈయన టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు వద్దకు మంగళవారం వెళ్లాడు. అయితే పోటీ చేస్తున్న తిరుపతిరావును బలపరుస్తూ అన్నాపురం ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు బార్నాన నాగేశ్వరరావు సైతం అచ్చెన్నాయుడు వద్దకు వెళ్లడం, ఆయన ద్వారా నామినేషన్ పత్రాలు అభ్యర్థితో పాటు కలిసి తీసుకోవడం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన ఉపాధి సిబ్బంది, ఒక పార్టీకి మద్దతు తెలపడంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి'

కవిటి: బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సోచట్టం)పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్ఐ కె.రాము సూచించారు. మండలంలోని కొత్తపాలెం కేజీబీవీ పాఠశాల, కవిటి ఎస్‌వీజే విద్యాసంస్థలలో మంగళవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ చట్టం ద్వారా బాలికలకు కల్పిస్తున్న రక్షణ చట్టాలను వివరించారు. రోడ్డు భద్రత నిబంధనలు, సైబర్ క్రైమ్ నిరోధానికి అనుసరించాల్సిన మార్గాలపై స్ఫూర్తి టీం సభ్యులు తెలియజేశారు. ఈ అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు తమవంతు పాత్ర పోషించాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మందస: మండలంలోని మూలిపాడు, సొండిపూడి, కొత్తపల్లి పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. శ్రీనివాసపురం-గోపాలపురం గ్రామాల్లో జరుగుతున్న కాలువ నిర్మాణాలను పరిశీలించి, పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. కొత్తపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలకు ఇరువైపులా నాటిన మొక్కలను చూసి సర్పంచ్ గుసిరి వెంకటరావును అభినందించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ గొరహరిమహంతి, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

'ఆర్థికాభివృద్ధికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు'

మందస: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు చెప్పారు. పట్టణంలోని శ్రీఅన్నపూర్ణమ్మ తల్లి ఆలయంలో మహిళా సంఘాలతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. స్వయంశక్తి సంఘాల్లోని మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేస్తామని తెలియజేశారు. వీవోలో తీర్మానం చేసుకుని మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రతీ సభ్యురాలు సెప్టెంబర్ నుంచి రూ.200 సేవింగ్స్ కట్టుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సున్నావడ్డీ పథకం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిచ్చుల తారక్‌మోహన్, వీవోలు గాయత్రి, శారద, నీరజ, శోభ పాల్గొన్నారు.

పోర్టు ప్రాంతంలో సీపీఐ నాయకుల పర్యటన

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు ప్రాంతంలో సీపీఐ నాయకులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల పంట పొలాలను పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం పోర్టు పరిసర ప్రాంతం పరిశీలించి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

గౌతు కుటుంబానికి... ఊడిగం చేయడం కాదు

- దమ్ముంటే టీడీపీ నుంచి టికెట్ తెచ్చుకోండి
- మంత్రి సీదిరిపై అర్థరహిత వ్యాఖ్యలు సరికాదు
- టీడీపీ మత్స్యకార నాయకులపై వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్ తదితరులు

వజ్రపుకొత్తూరు: గౌతు కుటుంబానికి ఊడిగం చేయడం కాదని, దమ్ముంటే పలాస నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ మత్స్యకార నాయకులు తెచ్చుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గం అంటే మత్స్యకారులకు అడ్డాలాంటిదని, దాని జోలికి స్థానికేతరులెవరూ రాలేరని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మత్స్యకార ముద్దుబిడ్డ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై అర్థం లేని ప్రేలాపణలు సరికాదని హితవు పలికారు. నువ్వలరేవు జెట్టీని ఫిషింగ్ హార్బర్ చేయాలని మంత్రి కృషి చేస్తుంటే, టీడీపీ నేతలు సెల్ఫీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నువ్వలరేవు ఇంజినీరింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతిని టీడీపీ రాజకీయంగా వాడుకోవాలనుకోవడం సిగ్గుచేటు అన్నారు. నెమలి కొండ, సూదికొండ, నల్లబొడ్లూరు కొండల వద్ద స్థలాలను చదును చేసి నిరుపేదలకు జగనన్న ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటే, కొండలను మింగేస్తున్నారంటూ ఆరోపణలు చేయడం టీడీపీ నేతల దగాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

చంద్రబాబు చిందుల మరిచారా..?

మత్స్యకారులను ఉద్దేశించి తాట తీస్తా.. తోలు తీస్తా అని అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు చిందులు మరిచిపోయారా అని ప్రశ్నించారు. మత్స్యకారులకు టికెట్ కావాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వద్దకు వెళ్లి చీవాట్లు తిన్న వజ్రపుకొత్తూరు మండల టీడీపీ మత్స్యకార నేతలను చూస్తే జాలేస్తోందన్నారు. టీడీపీ నుంచి మత్స్యకారులకు సీటు తెచ్చుకోలేని దౌర్భాగ్యం మీదని, వైఎస్సార్ సీపీ అంటేనే మత్స్యకారుల పుట్టినిల్లు అని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ముమ్మాటికీ మత్స్యకార బిడ్డలదే ఎప్పటికీ విజయమన్నారు. రానున్న ఎన్నికల్లో గౌతు శిరీషను చిత్తుగా ఓడిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మామిడి భాస్కరరావు, దున్న రమేష్, సైని కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- జలంత్రకోట సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

కంచిలి: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని జలంత్రకోట సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా స్థానిక సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి పండా, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మాజీ సర్పంచ్ కొయిరా గౌడో, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్ గౌడో, ప్రకాష్‌చంద్ర పండా తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపేట సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వజ్రపుకొత్తూరు: నాయీ బ్రాహ్మణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, అయ్యప్ప గురుస్వామి రాళ్లపేట కృష్ణారావు సేవలు మరువలేనివని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పూండి-గోవిందపురంలో రాళ్లపేట సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి రాళ్లపేట ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అయ్యప్ప స్వామి సేవకుడిగా, గురుస్వామిగా వేలాది మందిని ఆధ్యాత్మిక చింతనవైపు నడిపించారని కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు కె.గజపతి, కన్నయ్య, డివిజన్ అధ్యక్షుడు టి.కర్రెన్న, ఎల్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలో పెండింగ్‌లో ఉన్నటువంటి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, సర్పంచ్‌లు, గుత్తేదారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ సచివాలయాల భవనాలు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు, సీసీ రోడ్లు, సామాజిక భవనాలు, జగనన్న కాలనీలు, నాడు-నేడు పనులు, ఉపాధి పనులపై సమీక్షించారు. ప్రస్తుతం బిల్లుల చెల్లింపులు కూడా వేగంగా జరుగుతున్నాయని, ఎవరికైనా సమస్యలుంటే తమ దృష్టిలో పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, పీఆర్ ఏఈ బి.హిమసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.సతీష్, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, హౌసింగ్ ఏఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శివారుకు సాగునీరు ఇవ్వడంలో విఫలం

- వంశధార ఎస్ఈ మాటలన్నీ అబద్ధాలే
- అధికారుల పనితీరుపై మండిపడిన సభ్యులు
- సజావుగా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పలాస: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఉన్న వంశధార శివారు భూములకు సాగునీరు అందించడంలో ప్రతిఏటా జిల్లా ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. వంశధార అధికారుల పనితీరు బాగులేదని మండిపడ్డారు. వంశధార ఏఈ మీనాక్షి మాట్లాడుతూ ప్రస్తుతం శివారు భూములకు 220 క్యూసెక్కుల నీరు అవసరం కాగా, ప్రస్తుతం 133 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుందన్నారు. దీనివల్ల శివారు రైతులకు నీరు అందివ్వలేకపోతున్నామన్నారు. నీరు కిందికి రావాలంటే మరి కొద్దిరోజులు పడుతుందని తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ విద్యాసాగర్ మాట్లాడుతూ లక్ష్మీపురం, పెదంచల, చినంచల తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా రావాలంటే ఒక సబ్‌స్టేషన్ అవసరమని, స్థలం చూపించినట్లయితే తక్షణమే సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. లక్ష్మీపురం, తర్లాకోట తదితర సర్పంచ్‌లు మాట్లాడుతూ.. లక్ష్మీపురంలో వీధి మధ్య నుంచి హైటెన్షన్ లైను ఉందని, విద్యుత్ సమస్యలు చెప్పుకుంటామంటే లైన్‌మెన్ అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య మాట్లాడుతూ విద్యుత్ లైన్‌మెన్ స్థానికంగా ఉండటం లేదన్నారు. వ్యవసాయ అధికారి పోలారావు మాట్లాడుతూ రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. భూసార పరీక్షలు చేయడానికి ల్యాబ్ అందుబాటులో ఉందన్నారు. అయితే ఇప్పటివరకు ఎన్ని పరీక్షలు చేశారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు ఉంగ సాయికృష్ణ అడగగా, మండలం మొత్తం మీద 360 శాంపిల్స్ ఇప్పటివరకు తీసుకున్నట్లు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సవర దానమ్మ, తలగాన శ్రీరాములు, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జె.శంకరరావు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం బి.మల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసన్న, పంచాయతీరాజ్ ఏఈ పార్వతి, రెంటికోట పీహెచ్‌సీ డాక్టర్ సునీల్, ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఇచ్ఛాపురం: మండలంలోని రత్తకన్న గ్రామంలో సామాజిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలో 4 సామాజిక భవనాల కోసం రూ.20 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులు మంజూరయ్యాయని తెలియజేశారు. మొదటి విడతగా రూ.10 లక్షలు మంజూరయ్యాయని, మిగిలినవి రెండో విడతలో మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆశి లీలారాణి, కాళ్ల జయదేవ్, కొండ శంకర్, దక్కత డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

మందసలో ఆదివాసీ దినోత్సవం నేడు

మందస: పట్టణంలో బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్య అతిథిగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఆదివాసీ దినోత్సవంలో మంత్రి అప్పలరాజు చేతుల మీదుగా రూ.30 లక్షలతో ట్రైబల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేదల ప్రభుత్వమిది



రైస్ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ జోగారావు

సోంపేట: వైఎస్సార్‌సీపీది పేదల ప్రభుత్వమని ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. ఇటీవల నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన రైస్ కార్డులను గ్రామంలోని సచివాలయంలో మంగళవారం అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి చంద్రకళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



వజ్రపుకొత్తూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని రామకృష్ణాపురం సర్పంచ్ చింత హేమారావు అన్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు లఖినాన కరుణాకర్, దుప్పల అప్పారావు, జి.తులసీదాసు, కె.రామకృష్ణలను పాఠశాలలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.కిషోర్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కల్యాణి, ఉపాధ్యాయులు రమేష్, ప్రతాప్, సంతోషిని, కృష్ణవేణి, మహందాత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్దేశకులని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. మండలంలోని మండపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట శశిరేఖ, హెచ్‌ఎం జాడు ప్రకాష్, నాయకుడు పిట్ట మామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



సంతబొమ్మాళి: ఉమ్మిలాడ గ్రామంలో....



కంచిలి: జలంత్రకోటలో టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామంలో...

పౌష్టికాహారంతోనే గర్భిణులు, తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన పౌష్టికాహార కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. కిట్లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: చిన్నారులకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో తల్లిపాల వారోత్సవాలను కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీవో డి.శార్వాణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ తదితరులు హారతులు పట్టి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి మామిడి భాస్కరరావు, ఏపీఎం జాంభవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ గంగమ్మ, సరస్వతీ, లత, ధనలక్ష్మి, సంతోషి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పరామర్శ

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన దున్న తులసమ్మ ఇటీవల పాముకాటుతో మృతి చెందింది. దీంతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, తులసమ్మ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అనంతరం తులసమ్మ కుమార్తెలకు ప్రభుత్వం అందజేసిన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాధవరావు, పార్టీ నాయకులు గూడ తాతారావు, పాతిన నాని, గొరకల లింగరాజు, దుమ్ము లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ఇచ్ఛాపురం రూరల్: డ్వాక్రా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం రెండో రోజు వీవోలు, ఎంఎస్‌లకు నిర్వహించిన వర్క్ షాపులో పాల్గొన్నారు. పొదుపు విధానం, రుణాల నిర్వహణ, బీమా, పెన్షన్ పాలసీ, వార్షిక ప్రణాళిక, నిధుల నిర్వహణ, ఆదాయం మరియు వ్యయాన్ని నిర్వహించడంపై అవగాహన కల్పించారు.

800 మూగ జీవాలకు టీకాలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గరుడభద్ర పంచాయతీ పరిధిలోని గరుడభద్ర, హరిజనపేట, మర్రిపాడు, టి.గడూరు గ్రామాల్లో ఉన్న 800 మూగ జీవాలకు వ్యాధినిరోధక టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి మెట్ట పాపారావు తెలియజేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లో సర్పంచ్ గూడ గిరిజ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు, ఉచిత మందులు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడ ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ ఎ.దానేష్, ఉప సర్పంచ్ ఎం.పార్వతి, యువజన సంఘ అధ్యక్షుడు వై.సంతోష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పాలక సంఘం కృషి చేస్తోందని చైర్‌పర్సన్ అన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పిలక ఈశ్వరి, 14వ వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, నీలాపు డిల్లి పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

కంచిలి: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని ఎంఈవో-1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో వివిధ జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతికి నివాళి

పలాస: ప్రజా గాయకుడు గద్దర్ మృతి తెలుగు సమాజానికి తీరని లోటని గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. అతని మృతికి మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ప్రజా సమస్యలను పాటలుగా పాడి ప్రజలను చైతన్యవంతులుగా చేశారన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించండి

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని టెక్కలి ఎస్ఐ-2 రమేష్‌బాబు ఆటో డ్రైవర్లను కోరారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు.

99 మందికి కంటి పరీక్షలు

కాశీబుగ్గ: స్థానిక సత్యసాయి మందిరంలో పలాస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటివైద్య బృందం 99 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. దీనిలో 54 మందిని ఉచిత ఆపరేషన్లకు రిఫర్ చేశారు.

ఈనెల 11న ట్రై సైకిళ్ల పంపిణీ

పలాస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11న మండలంలోని దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ చేతులు మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. అవసరం ఉన్నవారు ముందుగా మండల కార్యాయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొబ్బరి రైతులను కాపాడాలి

కవిటి: ఉద్దానం కొబ్బరి ధరలను సిండికేట్‌గా మారి నియంత్రిస్తున్న దళారులు, వడ్డీ వ్యాపారుల నుంచి కొబ్బరి రైతులను కాపాడాలని రైతులు నినదించారు. మండలంలోని నర్తుపుట్టుగలో రైతుకులం నియోజకవర్గ కన్వీనర్ జేఎస్‌పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. దళారులు ఒడిశా నుంచి వస్తున్న వర్తకులను అడ్డగించి కొబ్బరికి ధర పెరగకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర కార్యాచరణతో కొబ్బరి రైతుల పోరాటానికి రైతుకులం ఆధ్వర్యంలో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో ఇప్పిలి కృష్ణారావు, దట్టి అజయ్, నర్తు దూదయ్య, కర్రి పొట్టియ్య తదితరులు పాల్గొన్నారు.